నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

సోమవారం
24 ఫిబ్రవరి
2025
పేజీలు 8

గుంటూరు
పల్నాడు

## చేదుకో కోటయ్య...
# మమ్మాదుకోవయ్యా...


పరమేశ్వరుడు జ్ఞానోపదేశం ఇచ్చిన పవిత్ర పుణ్యక్షేత్రమే కోటప్పకొండ. సృష్టికర్త బ్రహ్మదేవునికే జ్ఞానోపదేశం ఇచ్చిన ప్రదేశంగా యుగయుగాల నుంచి ఖ్యాతిచెందింది. 'చేదుకో కోటయ్య.. మమ్మాదుకోవయ్యా...' అంటూ యల్లమంద కోటయ్యగా ప్రజల పూజలందుకొనే త్రికోటేశ్వరస్వామి దేవాలయానికి శుక్రవారం నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి వస్తున్నారు. స్వామివారికి మొక్కుబళ్ళు తీర్చుకోవడానికి చిన్న చిన్న ప్రభలను తీసుకువచ్చేందుకు ఏర్పాటు చేస్తున్నారు. భక్తుల రాకను దృష్టిలో ఉంచుకొని నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు ,ఆధ్వర్యంలో దేవాదాయ శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. వివిధ ప్రాంతాల నుంచి కోటప్పకొండ కొచ్చే భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా పోలీస్ అధికారులు నిఘా ఏర్పాటు చేశారు. ప్రభలపై గత కొంతకాలం నుంచి రికార్డు డాన్స్ లు నిషేధిస్తున్నారు. పల్నాడు జిల్లా ఇన్చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, నరసరావుపేట శాసనసభ్యులు చదలవాడ అరవిందబాబు, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు కోటప్పకొండ తిరునాళ్ల ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఇదిలా ఉండగా శివరాత్రి పర్వ దినోత్సవం రోజు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కోటప్పకొండకు వచ్చి త్రికోటేశ్వర స్వామి దర్శించుకున్నారు...

పల్నాడు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో



శ్రీ త్రికోటేశ్వరస్వామి వారు - కోటప్పకొండ





4 లో



## మిర్చి రైతులకు కేంద్ర ప్రభుత్వం బిగ్ రిలీఫ్

- కూటమి ప్రభుత్వ నేతలకు హామీ ఇచ్చిన కేంద్రం
- మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీం కింద కొనుగోలు
- కేంద్ర మంత్రి పెమ్మసాని వెల్లడి

గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌లోని మిర్చి రైతులకు కేంద్ర ప్రభుత్వం బిగ్ రిలీఫ్ ప్రకటించింది. మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ కింద మిర్చి పంటను కొనుగోలు చేయాలని నిర్ణయించింది. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. మిర్చి రైతుల

మిగతా 3వ పేజీలో

## క్యూఆర్ కోడ్‌తో కొత్త రేషన్ కార్డులు

**వచ్చే నెలలో ఇచ్చే అవకాశం**

**పౌరసరఫరాల శాఖ మంత్రి మంత్రి నాదెండ్ల వెల్లడి**

గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో




రాష్ట్రంలో చాలా మంది కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురు చూపులు చూస్తున్నారు. అయితే త్వరలోనే వారికి ఆ బాధలు తప్పనున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డుల విషయమై కీలక నిర్ణయం తీసుకుంది. వచ్చే నెల నుంచి క్యూఆర్ కోడ్‌తో కూడిన కొత్త రేషన్ కార్డులు అందిస్తామని మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదివారం వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత కార్డుల్లో మార్పులు, చేర్పులకూ అవకాశం కల్పిస్తామని చెప్పారు. అన్ని గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రక్రియ మొదలవుతుందని చెప్పారు. ఇక రైతులకు పెండింగ్‌లో ఉన్న రవాణా, హమాలీ ఛార్జీలను రెండు రోజుల్లో విడుదల చేస్తామని తెలిపారు. ఇదిలా ఉంటే.. గత జులై, ఆగస్టులో రేషన్ కార్డులు మంజూరు చేస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. అయితే అప్పటి నుంచి పలు కారణాలతో ఈ అంశంలో ఎలాంటి పురోగతి కనిపించలేదు. వైసీపీ హయాంలోనే కొత్త రేషన్ కార్డులు, మార్పులు చేర్పులకు సంబంధించిన రూ.3.36 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇప్పుడు ఛాన్స్ కల్పిస్తే కొత్తగా కొన్ని లక్షల దరఖాస్తులు వస్తాయని అంచనా.

## సంత్ గాడ్గే బాబా సేవలు సమాజ శ్రేయస్సుకే

**ఎమ్మెల్యే గళ్ళా మాధవి**

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**



సమాజాన్ని పరిశుభ్రంగా ఉంచటం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు సంత్ గాడ్గే బాబా అని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. ఆదివారం సంఘసంస్కర్త సంత్ గాడ్గే బాబా జయంతి సందర్భంగా గుంటూరు సాయిబాబా రోడ్ లోని అడ్వకేట్ తుమ్మలపూడి శ్రీధర్ నివాసం నందు ఏర్పాటు చేసిన జయంతి కార్యక్రమానికి గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ముఖ్య అతిథిగా విచ్చేసి గాడ్గే బాబా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, అనంతరం జీవిత చరిత్రను వివరిస్తూ రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ బ్రిటీష్ కాలంలోనే గ్రామాల పరిశుభ్రత కోసం పరితపించిన త్యాగజీవి సంత్ గాడ్గే బాబా అని, అంటరానితనాన్ని నిర్మూలించడం కోసం, మూఢనమ్మకాల నుంచి సమాజాన్ని మేల్కొల్పిన యోధుడు సంత్ గాడ్గే బాబా అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి కొనియాడారు. ప్రతి రోజూ ఏదో ఒక ఊరు వెళ్లి ఊరంతా శుభ్రం చేసేవారని, బిడ్డ పుడితే జంతుబలి ఇచ్చే ఆచారాన్ని మహా రాష్ట్ర నుంచి తరిమేసిన చైతన్యశీలి గాడ్గే బాబా అని, గ్రామీణ ప్రజల చైతన్యం కోసం బాబా చేసిన కృషి నాటి నుంచి నేటి తరం వరకు స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. ఈ కార్యక్రమంలో కొమ్మినేని కోటేశ్వరరావు,వేములపల్లి శ్రీరామ్ ప్రసాద్, వడ్లమూడి వెంకటేశ్వరరావు, రాచకొండ నాగేశ్వరావు, గుర్రపు శాల రామకృష్ణ, నరసింహారావు, లక్ష్మయ్య, వేయంపాటి విజయలక్ష్మి, లక్ష్మీ కుమారి, బి. శ్రీనివాసరావు, పరమేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

## అగ్రిగోల్డ్ బాధితులకు సత్వర న్యాయం చేయాలని వినతి పత్రం అందజేత



**పెదకాకాని, మేజర్ న్యూస్ :** అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెన్సీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు అగ్రిగోల్డ్ బాధితులకు సత్వర న్యాయం చేయాలని ఆదివారం పొన్నూరు నియోజకవర్గ శాసనసభ్యుల వారి కార్యాలయంలో వింత పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి కేతినేని ఆగస్టీన్, సిపిఐ పార్టీ పొన్నూరు నియోజకవర్గ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ, సహాయ కార్యదర్శి షేక్ కరిముల్లా, నగర గౌరాధ్యక్షులు మాల్యాద్రి, నగర అధ్యక్షులు పివి సాంబశివరావు, ఇమ్మడి నాగరాజు, ఆరే.నాగరాజు, వెంకటేశ్వరరావు, అంజిబాబు, ఏఐటీయూసీ నాయకులు డేవిడ్ రాజు, సిపిఐ పార్టీ నాయకులు, మరియదాసు, ఏఐవైఎఫ్ నాయకులు వెంకటేశ్వరరావు, ఖాజావలి, అగ్రిగోల్డ్ బాధితులు పాల్గొన్నారు.

## శతాధిక వృద్ధుడు మృతి



**తెనాలి, మేజర్ న్యూస్ :** పట్టణంలోని అమరావతి కాలనీకి చెందిన శతాధిక వృద్ధుడు రావులపల్లి రాజారావు (105) అనారోగ్యంతో మృతి చెందారు. 1920 డిసెంబర్ 5వ తేదీన చండూరు మండలం యడ్లపల్లిలో రాజారావు జన్మించారు. రాజారావుకు ముగ్గురు సంతానం. పోస్ట్మాస్టర్ గా డాక్యుమెంట్ రైటర్ గా అనేక సంవత్సరాలు ఆయన పనిచేశారు.

# ఆధ్యాత్మిక అంశాలపై అవగాహన అవసరం

- గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్
- రంజాన్ విశిష్టతపై విద్యార్థులకు పోటీ పరీక్షలు



**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

చిన్న వయసులోనే పిల్లలకు ఆధ్యాత్మిక అంశాలతో పాటు ఖురాన్ చెప్పిన దయ, కరుణ, ప్రేమతత్వాన్ని నేర్పించాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్ అన్నారు. గుంటూరు లోని అంజుమన్ హైస్కూల్ ప్రాంగణంలో అంజామన్-ఎ-ఇస్లామియా కమిటీ ఆధ్వర్యంలో పవిత్ర రంజాన్ విశిష్టత గురించి విద్యార్థులకు పోటీ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అంజుమన్ ఇస్లామియా అధ్యక్షుడు, ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు ఆచరించే విధానాలు, వాటి వెనుక ఉన్న శాస్త్రీయ అంశాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో పండుగల ప్రాశస్త్యాన్ని ఇనుమడింపజేసేలా వేడుకలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సంక్రాంతి సంబరాలు, క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించామని, ఇప్పుడు రంజాన్ పండుగ సందర్భంగా ఇలాంటి గొప్ప కార్యక్రమాలు చేపడుతున్నామని వివరించారు. ఖురాన్ బోధనల ప్రకారం ప్రతి ఒక్కరూ దయ, కరుణ, ప్రేమతత్వం కలిగి ఉండాలని చెప్పారు. పవిత్ర ఖురాన్ బోధనల్లో దానధర్మాలు, ఐక్యత వంటి గొప్ప లక్షణాలను ఆచరించాలని అన్నారు. ఓర్పు, స్వీయ నియంత్రణ ఆధ్యాత్మిక అంశాల ద్వారా నేర్చుకోవాలన్నారు. రంజాన్ మాసం సందర్భంగా నిర్వహించిన పోటీ పరీక్షలు పాల్గొన్న విద్యార్థులను ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ అభినందించారు. కార్యక్రమంలో అంజుమన్ -ఎ- ఇస్లామియా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# తెనాలి బ్రాహ్మణుల సహకారం మరువలేనిది

**తెనాలి, మేజర్ న్యూస్ :** బ్రాహ్మణుల ఆశీస్సులతో నాకు అంతా మంచే జరుగుతుందని మాజీ మంత్రి, ఉమ్మడి కృష్ణా గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన ఉపాధ్యక్షులు తాడేపల్లి సూర్యనారాయణ మూర్తి (సూరిబాబు) ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక శ్రీ విద్యాభారతి నృసింహ సధనం లో తెనాలి బ్రాహ్మణ విద్యావంతుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆలపాటి మాట్లాడుతూ మొదటి నుండి అన్నివిషయాల్లో తెనాలిలో బ్రాహ్మణులు అండగా ఉంటున్నారని ఈ సారి కూడా వారి ఆశీస్సులు నాకు ఉండడం తన అదృష్టమని అన్నారు. కార్యక్రమంలో బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వేమూరి ఆనంద సూర్య, టి.శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా మహర్షి దయానంద స్వామి జయంతి



**తెనాలి, మేజర్ న్యూస్ :** మహర్షి దయానందసరస్వతి జయంతిని పురస్కరించుకుని స్థానిక పాత ప్రభుత్వ వైద్యశాలలో50 మంది టి. బి, ఎయిడ్స వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం అందించారు. ప్రధానమంత్రి టి.బి.ముక్తభారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో నందివెలుగు వృద్ధాశ్రమ కార్యనిర్వాహక సంఘ సభ్యులు తుమ్మల కృష్ణకుమారి, గుగ్గిలం రామ్మోహన్ రావు, కూరపాటి రవీంద్రనాథ్, కళ్యాణి దంపతులు విశ్వనాధుల నాగేశ్వరరావు, ఆంజనేయులు, అన్నవరపు నరసింహారావు గుగ్గిలం బదరి పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా ఎస్ఎన్ కాలేజీ ప్రిన్సిపల్ మానవతా సంస్థ నిర్వాహకులు కొలసాని రాంచంద్, మానవతా సంఘ ప్రముఖులు కటకం ప్రసాద్ తెనాలిజిల్లాప్రభుత్వ వైద్యశాల టి.బి.యూనిట్ వైద్యాధికారిణి డాక్టర్ దేవరపల్లిసుభాష్ రమాదేవి, టి.బి సూపర్వైజర్ పల్లెకొండ రవికుమార్, సబ్ యూనిట్ అధికారి అందె బాలచంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయాలు చేయడంకాదు అభివృద్ధి కావాలి

- కృష్ణా- గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి
- ప్రొఫెసర్ ధారా విక్రమ్



**గుంటూరు మేజర్ న్యూస్ :** రాజకీయాలు చేయడం కాదు, అభివృద్ధి కావాలి అని కృష్ణా- గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రొఫెసర్ ధారా విక్రమ్ అన్నారు. ఆదివారం తన స్వగృహంలో ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాల పరిపాలన, అధ్యాపక, పరిశోధన రంగాలలో సుదీర్ఘమైన అనుభవముతో వేలాదిమంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దానని అన్నారు. ఐదు సంవత్సరాలుగా ఇంజనీరింగ్ కళాశాలలో ప్రిన్సిపల్ గా, ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి ఎంటెక్, పీహెచ్డీ నందు పట్టా అందుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ప్రఖ్యాత విశ్వవిద్యాలయంలో ఆర్టిపిసిఎల్లీ ఇంటిలిజెన్సీ ప్రొఫెసర్ గా ఉన్నత బాధ్యతలు తీసుకున్నట్లు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికలు అనేది రాజకీయ నాయకులు, ఉద్యమకారులు పోటీ చేసేవి కాదని, ఇది కేవలం శాసనసభ, శాసనసభ మండలి అని అన్నారు. శాసనమండలి ఎగువ సభలో ఉన్నతమైన విద్యావంతులు, మేధావులు ఉండాల్సిన పదవని, కానీ ప్రస్తుత కాలంలో రాజకీయ నాయకులు, ఉద్యమకారులు పోటీ చేయవలసిన దుస్థితి ఏర్పడిందన్నారు. రాజకీయ నాయకులు, ఉద్యమకారులు వాళ్ళ స్వార్థ ప్రయోజనాలకి పట్టభద్రులను వాడుకోవాల్సి వస్తుందని అన్నారు. అలా కాకుండా ఉన్నతమైన విద్యావంతులు, మేధావులు ఎన్నుకోవడం వల్ల పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి కృషి జరుగుతుందని అన్నారు. ఈనెల 27న జరిగే కృష్ణా - గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీగా సీరియల్ నెంబర్ 15 లో ప్రొఫెసర్ దారా విక్రమ్ కి తమ ఓటు వేసి గెలిపించాలని కోరారు.

# అన్నమయ్య గ్రంథాలయానికి ఎన్.టి.అర్.కు నూరేళ్ళు, ఎల్.విజయలక్ష్మి పుస్తకాలు అందచేత



**గుంటూరు,రూరల్ మేజర్ న్యూస్ :** సెంట్రల్ ఎక్సైజ్ శాఖలో ఉద్యోగ విరమణ చేసి, గుంటూరులో అన్నమయ్య గ్రంథాలయాన్ని నిర్వహిస్తున్న లంకా సూర్యనారాయణకు మార్కెట్లోకి రాని రెండు సినిమా పుస్తకాలను సెంట్రల్ ఎక్సైజ్ పెన్షనర్ల సంఘం బహుకరించింది. ఆదివారం బృందావన్ గార్డెన్స్ లోని అన్నమయ్య గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో సెంట్రల్ ఎక్సైజ్ పెన్షనర్ల సంఘ నేత గుమ్మడి సీతారామయ్య చౌదరి ఆధ్వర్యంలో.. ఎన్.టి.అర్, ఎల్.విజయలక్ష్మి లపై నూతనంగా ప్రచురించిన పుస్తకాలను గ్రంథాలయానికి అందచేసారు. ఈ సందర్భంగా పెన్షనర్ల సంఘ నేతలు టి.వివేకానంద, జి.సీతారామయ్య చౌదరి మాట్లాడుతూ.. ఎన్.టి.అర్ అరుదైన ఫోటోలు, నేటి తరానికి తెలియని ఎల్.విజయలక్ష్మి సినీ జీవిత గాథ ఈ పుస్తకాల ప్రత్యేకత అన్నారు. బహుభాషా నటిగా నాట్య తారగా పేరొందిన ఎల్. విజయలక్ష్మి గ్రీన్ కార్డు సాధించి, ప్రస్తుతం వాషింగ్టన్‌లో స్థిరపడ్డారన్నారు. ప్రజా వినియోగానికి గ్రంథాలయంలో ఈ పుస్తకాలు అవసరమని భావించామన్నారు. పుస్తక రూపకర్తలు చిన్ని శ్రీను (రాజమండ్రి), కంపల్లె రవిచంద్రన్ (తిరుపతి) కోరిక మేరకు పుస్తక తొలి ప్రతులను గుంటూరులో పేరున్న అన్నమయ్య గ్రంథాలయానికి అందచేస్తున్నామన్నారు. అన్నమయ్య గ్రంథాలయ వ్యవస్థాపకులు లంకా సూర్యనారాయణ మాట్లాడుతూ.. గ్రంథాలయ అభివృద్ధికి విశ్రాంత ఉద్యోగులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సెంట్రల్ ఎక్సైజ్ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు టి.వివేకానంద, గుమ్మడి సీతారామయ్య చౌదరి, పి.వి.సత్యనారాయణ, పి.కోటేశ్వరరావు లైబ్రియన్ సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

# ఆలపాటి గెలుపే మా లక్ష్యం అంటున్న దాసరి కోటేశ్వరావు

**బొల్లాపల్లి మేజర్ న్యూస్ :** ఉమ్మడి కృష్ణ, గుంటూరు జిల్లాల శాసనమండలి పట్టభద్రుల ఎన్నికల సందర్భంగా తెలుగుదేశంపార్టీ బిజెపి, జనసేన కూటమి అభ్యర్థిగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయాన్ని కాంక్షిస్తూ ఎన్నికల ప్రచారం నిమిత్తం బొల్లాపల్లి మండలంలోని ఎస్సఈ కాలనీలు డిగ్రీ చదువుకున్న విద్యార్థులని ఓట్లను అభ్యర్థించిన బొల్లాపల్లి మండల తెలుగుదేశంపార్టీ %వాజ% నాయకులు. రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు దాసరి కోటేశ్వరావు , బొల్లాపల్లి మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు కనకరాజు చిననాసరయ్య కడియం మరియబాబు. పట్రా లింగయ్య, పట్రా రాంబాబు, మీసాల ఆదాం, రాగిపాటి మరియ బాబు, కొమ్ము కిరణ్, హనుమంతు ఆంజనేయులు, మేకల కనకయ్య, మీసాల నాగరాజు, మీసాల మహేష్, బండ్ల రవి, మీసాల కోటేశ్వరరావు, మాదాసు లాభాను, బండ్ల మోజేష్, రాగిపాటి దావీదు తదితరులు పాల్గొన్నారు.



# శ్రమదోపిడీ చేస్తున్న బ్యాంకులు




- మార్చి 24, 25న జరిగే సమ్మెను జయప్రదం చేయండి
- బ్యాంకు ఉద్యోగులకు ఏఐబీఈఏ పిలుపు

**గుంటూరు, రూరల్ మేజర్ న్యూస్ :** గుంటూరు బ్యాంకులలో స్వీపర్ కేడర్ క్రమంగా కనుమరుగు అవుతోందని అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం కార్యదర్శి బీఎస్ రాంబాబు ఆందోళన వ్యక్తం చేశారు. సబార్డినేట్ కేడర్ ఉద్యోగాలలో అతి తక్కువ వేతనాలతో తాత్కాలిక ఉద్యోగులను నియమించి బ్యాంకులు శ్రమదోపిడీ చేస్తున్నాయని అన్నారు. గుంటూరులో గత రెండు రోజులుగా జరుగుతున్న ఇండియన్ బ్యాంకు ఎంప్లాయీస్ యూనియన్(ఏపీ అండ్ టీఎస్) వర్కింగ్ కమిటీ సమావేశాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. యూనియన్ ఛైర్మన్ కె.రాధాకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బీఎస్ రాంబాబు మాట్లాడుతూ క్లరికల్ స్టాఫ్ సంఖ్యను కూడా బ్యాంకులు ఏ సంవత్సరానికి ఆ సంవత్సరం తగ్గిస్తూ వస్తున్నాయని అన్నారు. దాదాపు లక్ష క్లరికల్ ఖాళీలు బ్యాంకులలో ఉన్నాయని వెల్లడించారు. బ్యాంకులన్ని అవార్డ్ స్టాఫ్ కేడర్ లో నియమకాలు తక్షణమే చేపట్టాలని కోరారు. తాత్కాలిక ఉద్యోగులను బ్యాంకులలో ఉన్నా ఖాళీలలో భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. 2010 సంవత్సరం తరువాత బ్యాంకులలో చేరిన వారికి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, బ్యాంకులలో అయిదు రోజుల పని విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఐడీబీఐ బ్యాంకును ప్రైవేటుపరం చేయాలని కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను విరమించి, ఐడీబీఐ బ్యాంకును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని అన్నారు.

# మిర్చి రైతులకు కేంద్ర ప్రభుత్వం బిగ్ రిలీఫ్

**(మొదటి పేజీ తరువాయి)**

సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని, ఎంఐఎస్ స్కీమ్ ద్వారా మిర్చి సేకరణ ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, ఆంధ్రప్రదేశ్ సీఎం నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లకు పెమ్మసాని చంద్రశేఖర్ కృతజ్ఞతలు తెలిపారు. మిర్చి రైతులు తీవ్రంగా నష్టపోతున్న ఈ సమయంలో కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహాయంతో మిర్చి సేకరణ చేపట్టడం, రైతులకు పెద్ద ఊరట అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ స్కీమ్ కింద తొలుత 25 శాతం ఉత్పత్తిని కొనుగోలు చేయనున్నారు. అయితే, అవసరాన్ని బట్టి మిర్చి సేకరణ పరిమాణాన్ని పెంచే అవకాశం ఉందని కేంద్ర మంత్రి తెలిపారు. మిర్చి రైతుల సమస్యల పరిష్కారంలో భాగంగా కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి, ఏపీ సీఎం, డిప్యూటీ సీఎం కలిసి కృషి చేశారని పెమ్మసాని చంద్రశేఖర్ ట్వీట్‌లో పేర్కొన్నారు. మరోవైపు, మిర్చి రైతుల సమస్యలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. మిర్చి ధరలపై రైతులు, ఎగుమతిదారులతో కలిసి చర్చించి, తగ్గిన ధరలను ఎలా పెంచవచ్చు, ఎగుమతులను ఎలా ప్రోత్సహించవచ్చు అనే విషయాలపై సమగ్ర ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. అలాగే, గుంటూరు మార్కెట్ యార్డ్‌లో నిల్వలు, ధరల కదలికలపై వివరాలు తెలుసుకున్నారు. ఇటీవల మిర్చి ధరలు పడిపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే కేంద్రానికి లేఖ రాసిన చంద్రబాబు, తక్షణమే మిర్చి సేకరించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయం రైతులకు ఆర్థికంగా భారీ ఊరట కలిగించనుంది. మార్కెట్‌లో అనిశ్చితి కొనసాగుతున్న వేళ కేంద్ర ప్రభుత్వ సాయం రైతులకు భరోసా కల్పిస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరికొన్ని రోజుల్లో ఎంఐఎస్ అమలుపై పూర్తి వివరాలు వెలువడే అవకాశం ఉంది.

## వారబందీతో రైతులకు తీరని నష్టం



**నరసరావుపేట రూరల్, మేజర్ న్యూస్ :** నాగార్జునసాగర్ ఆయకట్టు కింద వేల ఎకరాల్లో రెండో పంట కింద సాగు చేస్తున్న సమయంలో వారబందీ విధించడం వలన రైతులకు తీరని నష్టం వాటిల్లుతుందని వైసీపీ పల్నాడు జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు అన్నెం పున్నారెడ్డి చెప్పారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా రైతాంగం రెండో పంట కింద మొక్కజొన్న, వరి, మినుము, పెసర తదితర పంటలు సాగు చేసినట్లు చెప్పారు. అయితే ఈనెల 28 నుండి వారబందీ ఇస్తామని అధికారులు తెలియజేశారు. వారబందీగా సాగునీరు ఇస్తామనే విషయం డిసెంబర్ మొదటి వారంలో అధికారులు రైతంగానికి తెలియజేస్తే బాగుండేది. తీరా రైతులు రెండో పంట వేసుకున్నాక ఇప్పుడు వారబందీ ప్రకటన చేయడం ఏమిటని ప్రశ్నించారు. దీని వల్ల రైతులు ఎకరానికి రూ.20వేల వరకు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. మీరు వారబందీగా సాగునీరు ఇవ్వాలనుకుంటే ఎకరానికి రూ.25వేలు నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో అధికారులు సమాలోచనలు చేసి, సీఎం చంద్రబాబునాయుడు, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఏప్రిల్ 30 వరకు పూర్తి స్థాయిలో సాగునీరు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతుల తరఫున వైసీపీ పోరాడుతుందని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం రైతులను వంచనకు గురిచేస్తోందని విమర్శించారు. సరైన గిట్టుబాటు ధరలు కల్పించడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ఇదిలాగే కొనసాగితే చూస్తూ ఊరుకోబోమని, రైతులతో కలిసి ఉద్యమస్తామని హెచ్చరించారు.

## నన్ను గెలిపిస్తే ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీల గళాన్ని శాసనమండలిలో వినిపిస్తా

### ఎమ్మెల్సీ అభ్యర్థి, దళిత నేత గంగోలు శామ్యూల్



**గుంటూరు మేజర్ న్యూస్ :** ఈ నెల 27వ,తేదీన జరిగే కృష్ణా-ఉమ్మడి కృష్ణ గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో తమ అమూల్యమైన ఓటును గంగోలు శామ్యూల్ అనే నాకే మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పట్టభద్రులకు ఎమ్మెల్సీ అభ్యర్థి, దళిత నేత గంగోలు శామ్యూల్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం గుంటూరులోని వారి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పట్టభద్రుల యువతకు మొదటి ప్రాధాన్యత ఓటుతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. విద్యావేత్తలను విలువలతో కూడిన రాజకీయాలు చేసేందుకు శాసనమండలికి పంపించాలని కోరారు. పట్టభద్రులు, యువత, ఉపాధ్యాయులు, న్యాయ వాదులు, డాక్టర్స్, పారిశ్రామికవేతలు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగస్తులు, ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీల పట్టభద్ర ఓటర్లు అందరూ గంగోలు శామ్యూల్ కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపిస్తే బలహీన వర్గాల తరఫున శాసనమం డలిలో గళం విప్పుతానని పట్టభద్ర ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ప్రజల కోసం అన్నివేళలా అందుబాటులో ఉండే వ్యక్తి గెలుపుతో ఉపాధ్యాయ వర్గానికి మంచి జరుగుతుందని ప్రైవేట్ ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## ఇంటింటికి తిరిగి చెత్త సేకరణ కార్యక్రమం



**నూజెండ్ల మేజర్ న్యూస్ :** స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమములో భాగంగా రెండవ రోజు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని ఈవోపీఆర్డి షేక్ రబ్బాని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామ పంచాయతీలలో క్లాప్ మిత్రలు ప్రతిరోజు ఇంటింటికి తిరిగి చెత్త సేకరణ కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. సేకరణ చేసిన చెత్తను సంపద కేంద్రాలకు తరలించి తడి,పొడి చెత్త వేరు చేసి వర్మీ కంపోస్ట్ తయారు చేయడం జరుగుతుందని తెలిపారు. ఆయన వెంట స్వచ్ఛభారత్ మండల రిసోర్స్ కోఆర్డినేటర్ కంచర్ల సుబ్బరామయ్య ఉన్నారు.

# చేదుకో కోటయ్య...
# మమ్మాదు కోవయ్యా



**పల్నాడు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

పరమేశ్వరుడు జ్ఞానోపదేశం ఇచ్చిన పవిత్ర పుణ్యక్షేత్రమే కోటప్పకొండ. సృష్టికర్త బ్రహ్మదేవునికే జ్ఞానోపదేశం ఇచ్చిన ప్రదేశంగా యుగయుగాల నుంచి ఖ్యాతిచెందింది. 'చేదుకో కోటయ్య..మమ్మాదుకోవయ్యా...' అంటూ యల్లమంద కోటయ్యగా ప్రజల పూజలందుకొనే త్రికోటేశ్వరస్వామి వారి దేవాలయం గుంటూరు జిల్లా నరసరావు పేట సమీపంలోని కోటప్పకొండ గ్రామంలో ఉంది. మహాశివరాత్రి పర్వదినాల్లో అత్యంత రద్దీగా భక్తజనంతో నిండిపోతుంది.

**దేవాలయ చరిత్ర**

దీనికి కచ్చితమైన ఆధారాలేమి లేకపోయినప్పటికీ శాసనాల ఆధారంగా ఈ ఆలయాన్ని క్రీ.శ 1172లో నిర్మించినట్లు చరిత్ర చెబుతుంది. ఈ ప్రాంతాన్ని పాలించిన రాజులలో ఒకరైన విజయనగర చక్రవర్తిశ్రీకృష్ణదేవరాయలు భూరి విరాళాలుఇచ్చారని శాసనాలుతెలుపుతున్నాయి. కోటప్ప కొండ ఎత్తు 1587 అడుగులు. త్రికోటేశ్వర స్వామి ఆలయం 600 అడుగుల ఎత్తులో ఉంది. ఈ కొండను ఏ కోణం నుంచి చూసిన మూడు శిఖరాలుకనబడుతుంటాయి. అందుకే దీనికి త్రికూటాచలమనే పేరు వచ్చింది. ఈ మూడు శిఖరాలను బ్రహ్మ, విష్ణు, రుద్ర రూపాలుగా భావిస్తారు.

**పురాణ కథనం**

శివుడు దక్ష యజ్ఞాన్ని భగ్నం చేసిన తరువాత బాలదక్షిణామూర్తి అవతారంలో బాలునిగా మారి కైలాసంలో కఠిన తపస్సునుఆచరిస్తూంటాడు. ఆ సమయంలో బ్రహ్మ దేవతలందరితోను కలిసి దక్షిణామూర్తినిసందరిస్తాడు. స్వామి వారిని మాకు జ్ఞానబోధ చేయమని వేడుకుంటారు. అప్పుడు పరమేశ్వరుడు త్రికూటాచలానికి వస్తే జ్ఞానాన్ని ఇస్తానని చెప్తాడు. అప్పుడు బ్రహ్మతో పాటు ఇతర దేవతలందరు కూడా త్రికూటాచలానికి వస్తారు అప్పుడు శివుడు త్రికూట కొండపైనే వెలసి వారందరికి జ్ఞానోపదేశాన్ని బోధిస్తాడు. ఆ ప్రదేశంలో ఉన్న గుడికే పాత కోటప్పగుడి అని పేరు. ఆలయం లోపలి లింగం కేవలం ఒక్క అడుగు మాత్రమే ఉంటుంది. గుడి ఉన్న శిఖరాన్ని రుద్ర శిఖరమని, పక్కన ఉన్న శిఖరాన్ని విష్ణ శిఖరమని అంటారు.దక్ష యజ్ఞం సమయంలో హవిస్సును స్వీకరించిన పాపం పోవడానికి విష్ణువు ఈ శిఖరం పై తపస్సు ఆచరిస్తాడు. అప్పుడు శివుడు ప్రత్యక్షమై త్రిశూలంతో నేల మీద పొడుస్తాడు. అలా పొడిచినప్పుడు ఏర్పడ్డ రంధ్రాల నుంచి వచ్చిన జలాన్ని స్వీకరించి స్నానమాచరిస్తే సకల పాపాలు తొలుగుతాయని చెప్తాడు. విష్ణువు శివుడు చెప్పిన విధంగా చేసి తన పాపాలనుపోగొట్టుకుంటాడు. ఆ విధంగా ఇక్కడ వెలసినశివున్నిపాపవినాశనేశ్వరుడనే పేరుంది.

రుద్ర శిఖరానికి నైరుతి భాగంలో ఉన్న శిఖరానికి బ్రహ్మ శిఖరమని పేరు. రుద్రవిష్ణు శిఖరాలపై స్వయంభువుగా లింగాలు వెలిశాయి. కానీ బ్రహ్మ శిఖరంపైఏమిలేకపోవడంతో బాధపడిన బ్రహ్మ శివునికోసంతపస్సు చేసిలింగావిర్భవంఅయ్యేటట్లు చేస్తాడు. ఈ ప్రదేశానికి తూర్పున మునిమంద / ఎల్లమంద అనే పేర్లు గల చిన్న పల్లెటూరుఉంది.ముందుగా బ్రహ్మదిదేవతలంతా ఈ ప్రదేశంలో ఉన్నారని అందుకే ఈ ప్రాంతానికి ఆ పేరు వచ్చిందని ప్రశస్తి. బ్రహ్మ శిఖరం మీద ఉన్న లింగానికేకొత్తకోటప్పకొండ అని పేరు.

**మహాభక్తురాలు.. ఆనందవల్లి..**

స్థలపురాణం ప్రకారం శివభక్తుడ్కెనసాలంకయ్యకు శివఅనుగ్రహంతో ఐశ్వర్యం లభిస్తుంది. పరమేశ్వరుడు కొన్ని రోజులపాటుజంగమదేవర రూపంలో అతని ఇంటికి వచ్చేవాడు. కొన్నాళ్లకు కనిపించలేదు. దీంతో సాలంకయ్య నిరాశ చెందాడు.ఆసమయంలోనే ఒక దంపతులకు ఆనందవల్లి అనే పాప జన్మించింది. పెరిగేకొద్ది శివునిపై భక్తి పెంచుకొని శైవగీతాలు ఆలపించేది. కొంతకాలం అనంతరం తపస్సు చేయడంతో స్వామి ప్రత్యక్షమయ్యారు. ఆనందవల్లి ప్రతిరోజూ రుద్రాచలానికి వచ్చి శివలింగానికి పూజలు నిర్వహించేది. ఈ సంగతి తెలుసుకున్న సాలంకయ్య తనకు కూడా శివదర్శనం ఇప్పించాలని కోరాడు.అయితే ఆమె అంగీకరించక శివుని ఆరాధనలో కొనసాగింది. ఒక రోజు అభిషేకం కోసం జలంతీసుకువెళుతుండగా నీటి కొరకు ఒక కాకి బిందె మీద వాలింది. దీంతో ఆగ్రహించి కాకులు ఇక్కడకు రాకూడదని శాపం పెట్టింది. ఇప్పటికీ కాకులు ఈ క్షేత్రంలో రాకపోవడం విశేషం. ఆమె భక్తికి మెచ్చిన పరమేశ్వరుడు ఆమెను కుటుంబజీవితం కొనసాగించమని బ్రహ్మచారిణిగా ఉన్న ఆమెను గర్భవతిగా మారుస్తాడు. అయినా ఆమె శివారాధన చేయడం మానలేదు. ఆమె భక్తికి మెచ్చిన ఈశ్వరుడు ప్రత్యక్షమై తానే ఆమె వెంట వచ్చి పూజలు స్వీకరిస్తానని అయితే ఇంటికి వెళ్లే సమయంలో తిరిగి చూడకుండా వెళ్లాలని ఆజ్ఞాపిస్తాడు. ఆనందవల్లి కొండ మెట్లు దిగుతూ ఒక చోట కుతూహలం కొద్దీ వెనక్కు తిరిగి చూడటంతో స్వామి వెంటనే అక్కడ వున్న గుహలో లింగరూపం ధరించాడు. ఆనందవల్లికి కుమారుడు జన్మించాడు. తానువెనక్కుతిరిగిచూడటంపై వల్లి బాధపడింది. మరణానికి సిద్ధం కావడంతో పరమేశ్వరుడు ప్రత్యక్షమవుతాడు. ఆసమయంలో బాలుడు కూడా అదృశ్యమవుతాడు. ఇదంతా శివమాయ అని ఆనందవల్లి గ్రహిస్తుంది. అనంతరం శివునిలో ఆమె ఐక్యమైంది.

### హరోం.. హర చేదుకో కోటయ్య

- **కోటప్పకొండకు లక్షలాదిగా తరలిరానున్న భక్తులు**
- **భక్తులకు అండ.. కోటప్పకొండ**
- **త్రికోటేశ్వర స్వామి కోటప్పకొండ**
- **పెద్ద ఎత్తున తరలిరానున్న విద్యుత్ ప్రభలు**
- **విస్తృత ఏర్పాటు చేస్తున్న దేవాదాయ శాఖ అధికారులు**

**కనువిందు కలిగించే విద్యుత్ ప్రభలు..**

మహాశివరాత్రి సందర్భంగా ప్రభల ప్రదర్శన అత్యంత వైభవంగా సాగుతోంది. జంగమయ్య చిత్రాలతో చిన్న ప్రభల నుంచి భారీ ఎత్తున ప్రభలను వూరేగింపుగా తీసుకువస్తారు. కొన్ని ప్రభలు యాభై అడుగుల కంటే ఎక్కువ ఎత్తు ఉండటం విశేషం. గతంలో ఎడ్లబండ్లలోతీసుకువచ్చేవారు. ప్రస్తుతం ట్రాక్టర్లను ఎక్కువగావినియోగిస్తున్నారు.

**దర్శన వేళలు..**

ఉదయం ఆరు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, మళ్లీ మధ్యాహ్నం మూడు గంటల నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు ఉంటుంది. స్వామివారికి అర్చన, ఉచిత దర్శనం సమయంలో తీసుకుంటే రూ.5 టికెట్ తీసుకోవాల్సి ఉంటుంది. ఇది కాకుండా ప్రత్యేక దర్శనం రూ.75, అష్టోత్రం రూ.100, అభిషేకం దంపతులకు మాత్రమే రూ.200, పంచ హారతి ఒక్కొక్కరికి రూ.100, పిల్లలకు అన్నప్రాసన చేయిస్తే రూ.150, అక్షరాభ్యాసం చేయిస్తే రూ.150 వీటితో పాటు వాహన పూజలు చేయించుకోవచ్చు. నవగ్రహ పూజ, శనిత్రయోదశి సందర్భాల్లో రూ.200 చెల్లించి పూజలు చేయించుకోవాలి. శాంతి యాదశాల పూజకు రూ.1116లు, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం (ఒకే కుటుంబానికి) రూ.1116లు చెల్లించాల్సి ఉంటుంది. మూలవిరాట్ అభిషేకం పర్వదినాల్లో అయితే రూ.400 చెల్లించాలి. ఇవి కాకుండా ప్రత్యేక స్కీములు ద్వారా కూడా స్వామివారికి పూజలు నిర్వహిస్తారు. జీవితకాల అభిషేకం (పదేళ్లు) రూ.2116లు, జీవిత కాల అష్టోత్రం (10 ఏళ్లు) రూ.1116లు, నిత్య గోత్రనామ పథకం ఏడాదికి రూ.1116లు చెల్లించాలి. కొండ వద్ద వసతిగృహాలు ఉన్నాయి. ఆనందవల్లి అతిథిగృహంలో గదికి రూ.250 చెల్లించాలి. తోట వారి అతిథిగృహంలో అయితే రూ.300, నంది అతిథిగృహంలో రూ.750 చొప్పున రుసుములు చెల్లించాల్సి ఉంది.

**పర్యాటక క్షేత్రం..**

కోటప్పకొండ పర్యావరణ పర్యాటక క్షేత్రంగానూ అభివృద్ధి చెందుతోంది. ప్రస్తుతం పల్నాడు జిల్లాగా ఏర్పడ్డ నరసరావుపేట ప్రభుత్వ అధికారులు, ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, జిల్లా ఇన్చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ తదితరులు కోటప్పకొండ మరింత అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని ప్రకటించారు.గతంలో పలుసార్లు నరసరావుపేటకు ఎమ్మెల్యేగా పని చేసిన దివంగత నేత, మాజీ శాసనసభాపతి డాక్టర్ కోడెల శివప్రసాద్ కూడా కోటప్పకొండను పర్యాటక క్షేత్రంగా అభివృద్ధి చేయడంలో కీలకపాత్ర పోషించారు. ఇప్పటికే భక్తుల కోసం బోట్ షికారు, టాయ్ ట్రైన్, బోట్ షికారు కోసం కాళింది మడుగు, పిల్లలు ఆడుకోవడానికి వీలుగా ఆట వస్తువులతో ఏర్పాటు చేసిన పిల్లల రాజ్యం, అక్వేరియం ప్రత్యేకంగా ఆకర్షణలుగా నిలుస్తున్నాయి. త్వరలో తీగమార్గం రాబోతోంది. కార్తీక మాసం అనగానే సహజంగానేవనభోజనాలు ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకుంటారు. అనేక పట్టణాల నుంచి, పిల్లల నుంచి పాఠశాలల విద్యార్థులను కార్తీక మాసంలో ఇక్కడ క్షేత్రానికి తీసుకువచ్చి అన్ని చూపించి భోజనాలు ఆయా పాఠశాలల యాజమాన్యాలే ఏర్పాటు చేస్తున్నాయి. ఇవికాకుండా కొండ కింద అన్ని సామాజిక వర్గాలకు అన్నదాన సత్రాలు ఉన్నాయి. ఇక్కడ ఈ సత్రాలకో ప్రత్యేకత ఉంది. గతంలో అయితే పండుగల సమయంలోనే ఉచిత భోజనం ఉంది. ఇప్పుడు భక్తులు ముందుగా వచ్చి చెబితే నిత్యం భోజన ఏర్పాట్లు చేస్తున్నారు.


**రాకపోకలకు మార్గాలు**

విజయవాడ, గుంటూరు వైపు నుంచి వచ్చే యాత్రికులు చిలకలూరిపేట మీదుగా, నరసరావుపేట మీదుగా కూడా కోటప్పకొండకు చేరుకోవచ్చు. సత్తెనపల్లి, పెదకూరపాడు ప్రాంతాల భక్తులు నరసరావుపేట మీదుగానే కోటప్పకొండకు చేరవచ్చు. మాచర్ల, గురజాల, కారంపూడి యాత్రికులు కూడా నరసరావుపేట మీదుగా కోటప్పకొండకు వెళ్లే మార్గం ఉంది. ప్రకాశం జిల్లాలోని మార్కాపురం, దర్శి, కురిచేడు, త్రిపురాంతకం, యర్రగొండపాలెం తదితర ప్రాంతాల భక్తులు వినుకొండ మీదుగా నరసరావుపేట వచ్చే మార్గంలో పెట్లూరివారిపాలెం మీదుగా కోటప్పకొండకు చేరుకోవచ్చు.

**వందేళ్ల నుండి అలరిస్తున్న ప్రభల సంస్కృతి**

గుంటూరు జిల్లా, ముఖ్యంగా పల్నాడు ప్రాంతంలో కనిపించే ఒక గొప్పసంస్కృతీ. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మహా శివరాత్రి నాడు గుంటూరు జిల్లాలోని కోటప్పకొండ క్వారీ బాలకోటేశ్వరస్వామి, సత్రశాల ప్రాంతాలలో ఈ ప్రభల సంస్కృతి కనిపిస్తుంది. కోటప్పకొండ సమీపంలోని కొండ కావూరు గ్రామానికి చెందిన ఆనందవల్లి అనే గొల్లభామ పరమశివ భక్తురాలు. ఆమె ప్రతిరోజు కొండపై చేరుకొని పాత కోటయ్యస్వామికి పూజలు చేసేది. ఒక నాడు తాను ఒయోభారంతో కొండ ఎక్కలేక పోతున్నాను స్వామిని వేడుకోగా స్వామి ప్రత్యక్షమై ముందు నీవు వెనుజూడకుండా కిందకు నడువు నీ వెనుక నేను వస్తానని చెప్పాడు. గొల్లభామ కిందకు దిగుతూ స్వామి వెనుక వస్తున్నారో లేదో అని వెనుదిరిగి చూడటంతో స్వామి శిళగా మారాడు. దీంతో గొల్లభామ తిరిగి ఆ స్వామిని వేడుకోగా కొండకు కోటీనొక్క ప్రభలు వస్తే అప్పుడు కొండదిగి కిందకు వస్తానిని చెప్పాడు. దీంతో ప్రతి సంవత్సరం శివరాత్రి నాడు కోటప్పకొండకు సమీపంలోని అన్ని గ్రామాల వారు ప్రభలు, విద్యుత్ ప్రభలు కట్టుకుని కోటప్పకొండకు వస్తారు. ముఖ్యంగా నర్సరావుపేట, చిలుకలూరి పేట, అమీన్ సాహిబ్ పాలెం, గంగనపాలెం, కోమటినేనివారి పాలెం, గోవిందపురం, కమ్మవారిపాలెం, కావూరు. అప్పాపురం, పురుషోత్తపట్టణం, ఉప్పల నపాడు, నకరికల్లు, దేచవరం, గామాలపాడు, ఈవూరు, బొమ్మరాజుపల్లి గ్రామాలు,పట్టణాలు నుండి భారీ ప్రభలులతో పాడు వివిధ గ్రామాల నుంచి చిన్న, మద్య తరహా ప్రభలు కొండకు వస్తాయి. ఈ సాంప్రదాయం వందల ఏళ్లనుంచి నడుస్తోంది. రంగు రంగుల ఆకర్షణతో కోటప్పకొండ, క్వారీ తదితర ప్రాంతాలకు వచ్చే విద్యుత్ ప్రభలు భక్తులను విశేషంగా ఆకర్షిస్తాయి. విద్యుత్ ప్రభలు అన్ని ఆయా ప్రాంతాల్లో ఉన్న శివాలయాల వద్దకు చేరుకోవటానికి తెల్లవారుజాము అవుతుంది. ప్రభల వైభవాన్ని తిలకించేందుకు ఆ సమయం వరకు లక్షల సంఖ్యల సంఖ్యలో భక్తులు దేవాలయాల వద్ద చేరుకుంటారు.









# శివాలయంలో శాస్త్రోతముగా ప్రారంభమైన మహాశివరాత్రి





**పెదకాకాని మేజర్ న్యూస్ :** శ్రీ మల్లేశ్వరస్వామి వారి దేవస్థానములో ఆదివారము మహాశివరాత్రి బ్రహ్మోత్సవముల మొదటి రోజు శ్రీ భ్రమరాంబ అమ్మవారు పెండ్లి కుమార్తె అలంకారములో భక్తులు దర్శించుకున్నారని ఆలయ ఉప కమిషనర్ గోగినేని లీలా కుమార్ తెలిపారు. బ్రహ్మోత్సవములలో భాగముగా ఆదివారము ఉ. గం.5 లకు సుప్రభాత సేవ, పంచహారతులు గం.8 లకు స్వామి వారికి మహన్యాసపూరీర్వక ఏకాథ రుద్రాభిషేకం, సాయంత్రం గం.4 లకు విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనము, పంచగవ్యప్రాశన, దీక్షధారణ, త్రిశూలపూజ, అంకురారోపణ, వాస్తుపూజ, శ్కైవాగ్ని ప్రతిష్ఠాపన జరుగునని రాత్రి గం.10.30 లకు ధ్వజారోహణ, ఆలయ బలిహరణ, సంతానముద్దలు పెట్టు కార్యక్రమములు శ్కైవాగమ పద్ధతిన దేవస్థాన స్థానాచార్యులు పొత్తూరి సాంబశివరావు, ప్రధాన అర్చకస్వామి పొత్తూరి లక్ష్మీనారాయణ వరప్రసాదు పర్యవేక్షణలో వేదపండితులు, అర్చకస్వాములచే నిర్వహించి నట్లు తెలిపారు. ఆలయ ఉపకమీషనరు గోగినేని లీలాకుమార్ ఆదివారము జరిగిన అంకురారోపణ తదితర పూజలలో పాల్గొన్నారు. ఈ రోజు ఉభయదాతలుగా పెదకాకాని గ్రామానికి చెందిన బోయపాటి రమణ ధనలక్ష్మీ దంపతులు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. మాఘ ఆదివారము సంధర్బముగా ఆలయము భక్తులతో కిటకిటలాడినది. భక్తులు అధిక సంఖ్యలో భక్తులు పొంగళ్ళు వండుకొని శ్రీ స్వామి వారికి నివేదిన చేసుకున్నారు. మేళతాళముల నడుమ ప్రభలతో ఆలయమునకు విచ్చేసి మ్రొక్కుబడులు తీర్చుకున్నారు. భక్తులకు శ్రీ స్వామి వారి దర్శనము తర్వితగతిన అగు విధముగా దేవస్థాన అధికారులు తగు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమములలో భాగముగా ఆదివారము సా.గం.6భవానీ భక్త సమాజము, పెదకాకాని వారిచే భజన కాలక్షేపము, రాత్రి గం.7 లకు యమ్. ప్రణతి, విజయవాడ వారిచే కూచిపూడి నృత్యము, రాత్రి గం.9శ్రీ శివశక్తి నాట్యమండలి, పెద్దపల్లి వారిచే శ్రీ వల్లీ కళ్యాణం పూర్తి నాటకం తదితర సాంస్కృతిక కార్యక్రమములు భక్తులను రంజింప చేసినవి. శ్రీ స్వామి వారిని దర్శించుకున్న ప్రతి భక్తునికి ఉచిత ప్రసాదము అందజేత ఆలయము ఉదయం గం.6 నుండి మధ్యాహ్నం ఆలయము మూయు వరకు తిరిగి సాయంత్రం గం.4 నుండి రాత్రి ఆలయము మూయు వరకు ఆలయ ప్రాంగణములో ఉచిత ప్రసాదమును భక్తులందరికి అందజేయవలెనని ఉద్దేశ్యముతో ఆలయ ప్రాకర మండపములో ప్రత్యేకముగా ఏర్పాటు చేసిన క్యూల్కెను ద్వారా ఆదివారము నుండి ఉచిత ప్రసాదము వితరణను ప్రారంభించినట్లు తెలిపారు. మహాశివరాత్రి పర్వదినమున శ్రీ స్వామి వారి దర్శనార్ధము విచ్చేయు వృద్ధులు, వికలాంగులు, చంటిపిల్లల తల్లులకు దేవస్థానము వారు ఏర్పాటు చేసిన పార్కింగ్ స్తలము (యాగంటి అపార్ట్‌మెంట్) వద్ద నుండి ఆలయము వరకు ఉచితముగా వాహన సర్వీసును దేవస్థానము వారు ఏర్పాటు చేసినట్లు ఆలయ ఉపకమీషనరు తెలిపారు. భక్తులు సదరు విషయము గమనించి దేవస్థాన వాహనములను వినియోగించుకొనవలసినదిగా తెలిపారు. బ్రహ్మోత్సవముల 2వ రోజు సోమవారము శ్రీ భ్రమరాంబ అమ్మవారు శ్రీ వనదుర్గాదేవి అలంకారముగా దర్శనమిస్తారని తెలిపారు. గురువారము సాయంకాలము గం.6.03లకు నరనంది వాహనముపై గ్రామోత్సవము అత్యంత వైభోపేతముగా జరుగునని కావున భక్తులు అధిక సంఖ్యలో శ్రీ స్వామి, అమ్మవార్లను దర్శించుకొన వలసినదిగా ఆలయ ఉపకమీషనరు గోగినేని లీలాకుమార్ భక్తులకు విజ్ఞప్తి చేసినారు.

# ఆలపాటికి విజయ తిలకం దిద్దుదాం

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో మరోసారి కూటమి ప్రభంజనం ఖాయం
- గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో

ఎనిమిది నెలల క్రితం ఓటు అనే ఆయుధంతో కూటమి ప్రభుత్వానికి తిరుగులేని విజయాన్ని కట్టబెట్టిన గుంటూరు ప్రజలు, మరోసారి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆలపాటికి విజయతిలకం దిద్దేందుకు సిద్ధంగా ఉన్నారని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం గుంటూరు తూర్పు నియోజకవర్గంలో అర్బన్ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ ఆత్మీయ సమావేశానికి ఎమ్మెల్యే నసీర్, మాజీ మంత్రి నక్కా ఆనంద్ బాబు, ఎమ్మెల్సీ అశోక్ బాబు, ఎన్నికల పరిశీలకులు నూకసాని బాలాజీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ విద్యా సంస్థల నుంచి డిగ్రీలు చేతపట్టుకుని ఉద్యోగాల వేటకు బయలుదేరిన నిరుద్యోగులకు నేనున్నానంటూ ఒక విజన్ తో పారిశ్రామిక విప్లవానికి సీఎం చంద్రబాబు నాయుడు బాటలు పరిచారని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. గతంలో మహాకవి శ్రీశ్రీ చెప్పినట్లు ఉద్యోగాల కోసం పట్టణాలకు బయలుదేరిన నిరుద్యోగులు ఉద్యోగాలు దొరక్క తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారని తెలిపారు. 1996లో సీఎం చంద్రబాబు నాయుడు అధికారం చేపట్టాక 2020 విజన్ కు శ్రీకారం చుట్టారని, దాని ఫలితంతో ఎందరో పట్టభద్రులు కాలేజీ చదువులు అయిపోయిన వెంటనే ఐదంకెల జీతం తీసుకుంటున్నారని తెలిపారు. ఇదంతా ఒక విజనరీ లీడర్ సీఎం చంద్రబాబు నాయుడు ముందుచూపే కారణమని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం బలపరిచిన పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తోన్న ఆలపాటి రాజాను గెలిపించుకుంటే మన బిడ్డల భవిష్యత్తు బాగుంటుందని తెలిపారు. గుంటూరు పట్టణంలో ప్రైవేటు పాఠశాలలో పని చేస్తోన్న ఉద్యోగులకు తాను ఎల్లప్పుడూ అండగా నిలుస్తానని, వారికి ఎలాంటి అవసరమొచ్చినా తమ కార్యాలయం తలుపులు ఎల్లప్పుడూ తీసి ఉంటాయని హామీ ఇచ్చారు. అనంతరం మాజీ మంత్రి నక్కా ఆనంద్ బాబు మాట్లాడుతూ సీనియర్ రాజకీయ నాయకులు, మాజీ మంత్రి ఆలపాటి రాజా గెలుపు ద్వారా గుంటూరు జిల్లా సత్తా ఏంటో ప్రతి పక్షాలకు మరోసారి తెలియజేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ అశోక్ బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉద్యోగులకు మంచి జరుగుతుందని, ఇది కొనసాగింపుగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆలపాటిని గెలిపించుకుందామని కోరారు. నూకసాని బాలాజీ మాట్లాడుతూ కేవలం ఎనిమిది నెలల వ్యవధిలో రాష్ట్రంలో అనూహ్యమైన ప్రగతి కనిపిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుంటూరు అర్బన్ ప్రైవేట్ స్కూల్స్ కరస్పాండెంట్స్, డైరెక్టర్స్, ప్రిన్సిపల్స్, టీచర్స్, తదితరులు పాల్గొన్నారు.



## ప్రజల హక్కుల కోసం నిర్విరామంగా కృషి చేయాలి

### హైకోర్టు న్యాయవాది నాగేశ్వరరావు



**పెదకాకాని మేజర్ న్యూస్ :** ప్రజల హక్కులు,బడుగు వర్గాల సత్వర న్యాయం న్యాయం సహాయం కోసం ప్రజా సంకల్ప వేదిక సొసైటీ రాష్ట్ర కమిటీలో నియమితులైన ప్రతి ఒక్కరూ నిర్విరామంగా కృషి చేయాలని ఏపీ హైకోర్టు న్యాయవాది నంబూరు నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని నంబూరు విజయ భాస్కర్ నగర్ లో ప్రజా సంకల్ప వేదిక సొసైటీ రాష్ట్ర కమిటీలో భాగమైన అవినీతి నిరోధక రాష్ట్ర అడ్వైజర్ గా, జిల్లా ఇన్చార్జిగా మొండితోక సుబ్బారావు, మానవ హక్కుల పరిరక్షణ విభాగం రాష్ట్ర ఉపాధ్యాక్షనిగా నియమితులైన సందర్భంగా అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సభకు నంబూరు సాంబయ్య అధ్యక్షత వహించి మాట్లాడుతూ ప్రజా సంకల్ప వేదిక రాష్ట్రవ్యాప్తంగా సంఘాలు ఉన్నాయన్నారు. న్యాయవాదులు, ఉద్యోగులు, మేధావులు పనిచేస్తున్నారని, ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులకు సమస్యలు తెలియజేయడం, నాయకుల దృష్టికి సమస్యలు తీసుకెళ్లే విషయంలో కృషి చేయటానికి అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో నంబూరు సాల్మన్, నంబూరు యోహాను, అడ్వకేట్ పాములు,రెవ. బాదెల రాజు, ఎస్. వెంకటేశ్వరరావు, వీరయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## మేధావి కె ఎస్ లక్ష్మణరావును గెలిపించండి



**తెనాలి, మేజర్ న్యూస్ :** ఉద్యోగ, కార్మిక, పట్టబద్రుల, నిరుద్యోగుల సమస్యలపై నిరంతరం పోరాడే పిడిఎఫ్ అభ్యర్థి కె ఎస్ లక్ష్మణరావు ను గెలిపించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివసాంబిరెడ్డి అన్నారు. ఫిబ్రవరి 27న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా తెనాలి పట్టణంలోని ఐతానగర్, హయ్యర్ పేట గ్రామాల్లో ఆదివారం ప్రచారం నిర్వహించారు. పిడిఎఫ్ అభ్యర్ధి కె ఎస్ లక్షమణరావును గెలిపించాలని కోరుతూ పట్టభద్రులను అభ్యర్దించారు. మేధావి, విద్యావంతుడు, వివేకవంతుడైన కెఎస్ లక్ష్మణరావు కు తమ పూర్తి మద్దతు, తమ కుటుంబ సభ్యుల మద్దతు మొదటి ప్రాధాన్యత ఓటు వేసేలా ప్రయత్నం చేయాలని సాంబిరెడ్డి కోరారు. కార్యక్రమంలో పిల్లి రాజశేఖర బాబు, ఎస్.ఎఫ్.ఐ నాయకుడు తేళ్ల విజయ్ పాల్గున్నారు.

18 వసంతాల 'నేటి దినపత్రిక సూర్య' మహాయజ్ఞంలో
'నేటి దినపత్రిక సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో
అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను
అధిగమించింది. ఈ ప్రస్థానంలో
సూర్యాక్షరంతో మమేకమైన 'నేటి దినపత్రిక సూర్య'
కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు.
మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు,
శ్రేయోభిలాషులకు పేరుపేరునా
కృతజ్ఞతాభివందనాలు.
ఇట్లు... పి. బాలు (చిన కొండయ్య)
బ్యూరో ఇన్‌చార్జి, ఉమ్మడి గుంటూరు జిల్లా.
సెల్ : 9705554777

## ఘనంగా సిమ్స్‌మై స్కూల్ వార్షికోత్సవం



గుంటూరు, రూరల్ మేజర్,న్యూస్: సిమ్స్ మై స్కూల్ వార్షికోత్సవ వేడుకలు సిమ్స్ కళాశాల ఎదురు ఉన్న మైదానంలో అంగరంగ వైభవంగా జరిగాయి . సిమ్స్ విద్యాసంస్థల డైరెక్టర్ భీమనాథం భరత రెడ్డి నేతృత్వంలో ఈ వేడుకలు జరిగాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బుల్లితెర ప్రముఖ యాంకర్ సినీనటి అనసూయ హాజరయ్యారు. ఈ సందర్భంగా అనసూయ విద్యార్థులను వారి తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి సిమ్స్ మై స్కూల్ యాజమాన్యం చేస్తున్న కృషి ఎనలేని దని కొనియాడారు. భారత దేశ భవిష్యత్తు రానున్న రోజులలో విద్యావంతుల భుజస్కంధాలపై ఉందని భావి భారత పౌరులను తీర్చిదిద్దటంలో సిమ్స్ మై స్కూల్ ప్రథమ స్థానంలో నిలవడం అభినందనీయమన్నారు. సిమ్స్ విద్యాసంస్థల సెక్రెటరీ కరస్పాండెంట్ డాక్టర్ శివ శిరీష, డైరెక్టర్ భీమనాథం భరత్ రెడ్డి మాట్లాడుతూ సిమ్స్ మై స్కూల్ యాజమాన్యంపై తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశలను వారి పిల్లలకు ఉత్తమ క్రమశిక్షణ కలిగిన విద్యను అందిస్తూ నిజం చేస్తున్నామని వారు పేర్కొన్నారు. కార్యక్రమానికి గౌరవ అతిథులుగా గుంటూరు తూర్పు శాసనసభ్యులు ఎండి నజీర్ అహ్మద్,సినీ నటులు రఘు గారు,గగన్ విహారి ,సిని డైరెక్టర్ సీసీ ,గుంటూరు మాజీ డిప్యూటీ మేయర్ గౌస్ ,ఇర్రి సిద్ధార్థ్, కిమ్స్ హాస్పిటల్ డాక్టర్స్,సిమ్స్ మై స్కూల్ ప్రిన్సిపల్స్, సిమ్స్ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్ ప్రిన్సిపల్స్, మేనేజర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. వేడుకలు ఆశాంతం ఉత్సాహం ఉల్లాసం ఆనందోత్సాహాల మధ్య జరిగాయి. పిల్లల కేరింతలతో ఆహ్లాదకర వాతావరణంలో ముచ్చట గొలిపే చిన్నారుల మధ్య వేడుకలు అత్యంత ఆనందభరితంగా జరిగాయి.

## కెఎస్ఎం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**తెనాలి, మేజర్ న్యూస్ :** పట్టణంలోని కొంగంటి శివయ్య మున్సిపల్ హైస్కూల్ పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఈ సమ్మేళనంలో 1983-84 సంవత్సరం పదవ తరగతి చదివిన విద్యార్థులు పాల్గొన్నారు. సుమారు 30 మందికి పైగా పూర్వపు విద్యార్థులు హాజరై తమ మిత్రులను కలుసుకున్నారు. వారి గత కాలపు స్మృతులను నెమరువేసుకున్నారు. 41 సంవత్సరాల తర్వాత పూర్వ విద్యార్థులందరూ కలుసుకుని గత జ్ఞాపకాలను గుర్తు చేసుకోవటం సంతోషంగా వుందని గుర్తు చేసుకున్నారు. అలాగే అప్పటి ఉపాధ్యాయులు యెంతో గొప్పవారని తమని తీర్చిదిద్దారని వారి యొక్క బోధనలతో విద్యాబుద్ధులు నేర్చుకొని జీవితంలో ఉన్నతంగా ఎదిగామని అన్నారు. స్కూలు ఆవరణం మొత్తం కలియ తిరిగి గత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ప్రతి సంవత్సరం యిలాంటి ఆత్మీయ సమ్మేళనాలు జరుపుకోవాలని తీర్మానించుకున్నారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో అలనాటి గురువుల బోధనలను, వారిని స్ఫూర్తిగా తీసుకుని ఎదిగారన్నారు. వారితో పాటు గతంలో చదువుకొని మరణించిన తమ చిన్ననాటి స్నేహితులు, ఉపాధ్యాయులకు నివాళులర్పించారు. కార్యక్రమం జయప్రదం కావటానికి ముఖ్యులు కంచర్ల శ్రీను, డాక్టర్ సురేష్, బషీర్, శివకుమార్, గోలి శ్రీను ప్రభాకుమార్, పద్మ, వెంగ మ్మ, విజయ, మాధవి, తదితరులు పాల్గొన్నారు.

## కోటప్పకొండలో తాత్కాలికంగా అభిషేకాలు రద్దు

**నరసరావుపేట రూరల్, మేజర్ న్యూస్:** కోటప్పకొండ శైవక్షేత్రంలో వేంచేసియున్న శ్రీ త్రికోటేశ్వరస్వామి వారికి మహాశివరాత్రి పురస్కరించుకొని అభిషేకాలు రద్దు చేస్తున్నట్లు ఈవో చంద్రశేఖరావు ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 23 నుంచి 27 వరకు స్వామివారి మూలవిరాట్ కు తాత్కాలికంగా అభిషేకాలు రద్దు చేస్తున్నామన్నారు. మహాశివరాత్రి సందర్భంగా తిరునాళ్లకు భక్తులు అధిక సంఖ్యలో కోటప్పకొండకు చేరుకుంటారని వివరించారు. ఆ సమయంలో మూల విరాట్ కు అభిషేకాలు జరిపించడం వీలుపడదని పేర్కొన్నారు. అయితే అభిషేక మండపంలో యథావిధిగా పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. భక్తులు సహకరించాలని ఆయన కోరారు.

# స్వచ్ఛతపై నినదించిన తొలి సంఘసంస్కర్త సంత్ బాబా

## బీసీ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా సంత్ గాడ్గే బాబా 150 వ జయంతి వేడుకలు



**సత్తెనపల్లి రూరల్, మేజర్ న్యూస్ :** స్వచ్ఛభారత్ పితామహుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురువు,పరిశుభ్రతే దైవమని భావించిన తొలి సంఘసంస్కర్త గాడ్గే బాబా అని బీసీ సంఘాల నాయకులు కొనియాడారు. పట్టణంలోని ఎన్.జి.ఓ సెంటర్ లో బీసీ సంఘ నాయకులు పిల్లకతువుల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం సంత్ గాడ్గే బాబా 150వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా గాడ్గే బాబా చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా బీసీ సంఘ నాయకులు మాట్లాడుతూ చీపురుతో వీధుల్ని, కీర్తనలతో మస్తిష్కాలనీ శుభ్రం చేసిన వాగ్గేయకారుడు సంత్ గాడ్గే బాబా అని అన్నారు. గుడికి బదులు బడిలో ఆధ్యాత్మికతకు బాటలు వేసాదన్నారు. సమస్త ఛాందసాలనూ హేతువుతో ఖండించిన సాధువు అని అన్నారు. ప్రకృతిని కాపాడుకోవాలని చెప్పిన పర్యావరణ వాది, తన జీవితాన్ని సమాజానికి అర్పించిన సర్వసంగ పరిత్యాగి సంత్ గాడ్గే బాబా అని ఆయన జీవిత చరిత్ర నేటి రేపటి యువతరానికి స్ఫూర్తి దాయకం అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు కుమ్మరి దస్తగిరి, చింకా అంకమ్మ రావు,ఛావల వెంకటేశ్వర్లు, పిక్కిలి రత్తయ్య, బొంత కోటయ్య, విప్పర్ల కొండలు,పిక్కిలి శివ, గుంజి విజయ్,యర్రగొర్ల శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# పొన్నూరు పట్టణంలో పేట్రేగిపోతున్న దొంగలు

## భయ భ్రాంతులకు గురవుతున్న షాపు యజమానులు




**పొన్నూరు, మేజర్ న్యూస్ :** ఒక చోట పట్ట పగలు,15 నిముషాలు వ్యవధిలో రెండు దొంగతనాలు మరియొక చోట పొన్నూరు పోలీస్ స్టేషన్ పక్కన, ఇంకొకటి పొన్నూరు ఐలాండ్ సెంటర్ నడిబొడ్డున పోలీసులకు సవాల్ విసురుతున్న దొంగలు. రాత్రి పగలు తేడా అనేది లేకుండా పొన్నూరు పట్టణంలో హల్ చల్ చేస్తున్న దొంగలు. అంతర్రాష్ట్ర దొంగలకన్నా మన చుట్టుపక్కల ఉన్నవారు ఎక్కువయ్యారు షాపు యజమానులు ఎవరు దొంగవాడు ఎవరు వినియోగదారుడు అని కనుక్కోలేక తికమక పడుతున్నారు. దొంగతనం జరిగిందని పోలీస్ స్టేషన్ కు ఫిర్యాదు చేయలేక కొంతమంది చిన్న మొత్తమే కదా అని దీనికోసం పోలీస్ స్టేషన్ వరకు ఎక్కడ వెళ్లాములే అని ఊరుకుంటున్న కొంతమంది పట్టణంలో అన్ని చోట్ల ఎన్ని సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినా గాని దొంగతనాలు ఆగడం లేదు. పట్టణంలో ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటి ద్వారా దొంగలను పట్టుకోవడానికి వీలుగా ఉంటుందని గతంలో పొన్నూరు పట్టణంలో విధులు నిర్వహించిన టౌన్ సిఐలు చాలా కూడలలో షాపు యజమానులతో మాట్లాడి సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ మధ్యకాలంలో దొంగలు మళ్ళీ హల్చల్ చేయడం ప్రారంభించారు పోలీసుల అప్రమత్తమై దొంగలను పట్టుకోవాలని ఇటువంటి సంఘటనలు జరిగిన కానీ త్వరితగతిన పరిష్కారం చేయాలని పట్టణ ప్రజలు కోరుకుంటున్నారు.

## రంజాన్ పురస్కరించుకుని హలీం సెంటర్ ప్రారంభం




**తెనాలి, మేజర్ న్యూస్ :** స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని వహీద్ హలీం సెంటర్ రజతోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణానికి చెందిన షేక్ అబ్దుల్ వహీద్ గత పాతికేళ్లుగా రంజాన్ మాసంలో హలీం సెంటర్ నిర్వహిస్తున్నారు. రానున్న రంజాన్ మాసం పురస్కరించుకుని జనవిజ్ఞాన వేదిక గుంటూరు జిల్లా గౌరవ అధ్యక్షులు డాక్టర్ భీమవరపు సాంబిరెడ్డి చేతులమీదుగా హలీం సెంటర్ ను ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ కొత్త రవికిరణ్, డాక్టర్ కొత్త శశికిరణ్, డాక్టర్ నయీం ఖాన్, అబ్దుల్ ఆసిఫ్, అబ్దుల్ అష్రఫ్ తదితరులు పాల్గొన్నారు.

# ఐదు జిల్లాల మీదుగా అమరావతి రింగ్ రోడ్డు!

**గుంటూరు జిల్లా నేటిన పత్రిక సూర్య బ్యూరో**

అమరావతి నగరంతో పాటు రింగ్ రోడ్ కూడా సమాంతరంగా నిర్మించేందుకు అవసరమైన పనులన్నీ చకచకా సాగుతున్నాయి. ఓఆర్ఆర్ వెళ్లే ఐదు జిల్లాల్లో భూసేకరణకు ప్రభుత్వం అధికారులను నియమించింది. 23 మండలాలు, 121 గ్రామాల మీదుగా 189.9 కిలోమీటర్ల మేర ఈ రింగ్‌రోడ్డు నిర్మాణం కానుంది. ఎన్టీఆర్, కృష్ణా, పల్నాడు, గుంటూరు, ఏలూరు జిల్లాల్లో ఈ రింగ్ రోడ్ ఉంటుంది. మూడు ఎలైన్‌మెంట్లను సిద్ధం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపింది. ఎలైన్‌మెంట్‌లో స్వల్ప మార్పుచేర్పులు, లింక్‌రోడ్ల ఎలైన్‌మెంట్‌ల ప్రతిపాదనలకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిన తర్వాత వాటిని కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖకు పంపిస్తారు. అక్కడ తుది ఆమోదం తెలుపుతారు. ఓఆర్ఆర్ భూసేకరణకు సర్వే నంబర్ల వారీగా నోటిఫికేషన్ జారీచేస్తారు. 21 రోజులు గడువిచ్చి అభ్యంతరాలు తెలిపిన వారితో జేసీలు సమావేశాలు నిర్వహించి పరిష్కరిస్తారు. అదే టైమ్ లో క్షేత్రస్థాయిలో జాయింట్ మెజర్‌మెంట్ సర్వే చేసి పెగ్ మార్కింగ్ వేస్తారు. భూసేకరణ జరుగుతుండగానే 3డీ నోటిఫికేషన్ జారీ చేస్తారు. అంటే ఆయా సర్వే నంబర్లలో భూములు కేంద్రం అధీనంలోకి వెళ్లిపోతాయి. భూసేకరణ నిధులు ఎన్‌హెచ్ఏఐ అందజేస్తే భూమికి సంబంధించిన యజమానులకు ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తారు. తర్వాత నిర్మాణ పనులు ప్రారంభమవుతాయి. ఇవన్నీ ఆరేడు




నెలల్లో పూర్తి చేయనున్నారు. ఆ తర్వాత నిర్మాణం ప్రారంభం కానుంది. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్ అభివృద్ధి ఎలా ఉపయోగపడిందో అమరావతి అభివృద్ధికి కూడా ఈ రింగ్ రోడ్ ఉపయోగపడుతుందని అంచనా వేస్తున్నారు.

# ప్రజా గొంతును అసెంబ్లీలో వినిపిద్దాం

- ప్రజల సమస్యలు, ఆకాంక్షలను చట్టసభల్లో చర్చిద్దాం
- చర్చల్లో మన సభ్యులు చురుగ్గా పాలుపంచుకోవాలి
- మనం మాట్లాడే భాష హుందాగా ఉండాలి
- వైసీపీ భాష వద్దు
- జనసేన పార్టీ సమావేశంలో సభ్యులకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్



**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

'అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో జనసేన పార్టీ సామాన్యుడి గొంతుగా ఉండాలి. ప్రజల సమస్యలను, ఆకాంక్షలను, ఆశలను, సంక్షేమాన్ని, చట్టసభల్లో వినిపించేలా పార్టీ తరపున ఎన్నికైన ప్రతి శాసనసభ్యుడు, శాసనమండలి సభ్యులు చర్చల్లో పాల్గొనాలి' అని జనసేన పార్టీ అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పార్టీ శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులకు దిశా నిర్దేశం చేశారు. శాసనసభ సంప్రదాయాన్ని, మర్యాదను కాపాడుతూ హుందాగా ముందుకు వెళ్దామని చెప్పారు. చట్ట సభలలో ఎంత విలువైన చర్చలు జరిగేవో ఒకసారి అందరూ పరిశీలించాలని సూచించారు. ఎప్పటికప్పుడు సమస్యలపై పూర్తి అవగాహన పెంచుకొని చర్చల్లో పాల్గోవాలని సూచించారు. బడ్జెట్ సమావేశాలు సోమవారం నుంచి మొదలవుతున్న తరుణంలో జనసేన పార్టీ శాసనసభాపక్ష సమావేశం ఆదివారం సాయంత్రం జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగింది. ముందుగా పార్టీ పీఏసీ ఛైర్మన్, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్వాగత ఉపన్యాసం చేస్తూ.. బడ్జెట్ సమావేశాల్లో పార్టీ విధివిధానాలు అనుసరించి చర్చల్లో బలంగా పాల్గొనాలని, పవన్ కళ్యాణ్ దిశానిర్దేశంలో ముందుకు వెళ్లాలని సూచించారు. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రిగా పవన్ కళ్యాణ్ గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అంకిత భావంతో పని చేస్తున్నారు అన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం మనందరం కట్టుబడి ఉండాలని తెలిపారు. ఆ స్ఫూర్తి మనం పాల్గొనే చర్చల్లో కనిపించాలి అన్నారు. అనంతరం పవన్ కళ్యాణ్మాట్లాడుతూ "శాసన సభ్యులు మాట్లాడే ప్రతి పదం ఎంతో ప్రభావవంతమైనది. చట్టసభల్లో మాట్లాడే భాష విషయంలో, వాడే పదాల విషయంలో సభ్యులు జాగ్రత్తగా ఉండాలి. ఏ మాత్రం అభ్యంతరకర పదజాలం వాడవద్దు. హుందా అయిన భాష, గౌరవంతమైన పదాలను నాతో సహా ప్రతి ఒక్కరూ వినియోగించాలి. చట్టసభల్లో మనం మాట్లాడే ప్రతి విషయాన్ని ప్రజలంతా చూస్తున్నారని, వారి ఎదురుగా మనం మాట్లాడుతున్నామనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. వైసీపీ దిగజారుడు భాష వాడింది. ఆ తరహా భాష వద్దు.

**వైసీపీవి బురద రాజకీయాలు**

వైసీపీ ప్రభుత్వ హయాంలో అసెంబ్లీలో వైసీపీ ప్రజాప్రతినిధులు అప్పట్లో వాడిన భాష, వ్యవహరించిన విధానం ప్రజలంతా గమనించారు. వారు పూర్తిగా బురదలో కూరుకుపోయారు. వారి బురద మనకు అంటించాలని చూస్తారు. వారి బురద రాజకీయాలకి పడకుండా, వారు రెచ్చగొట్టినా రెచ్చిపోకుండా హుందాగా వ్యవహరించాలి. వైసీపీ ప్రజాప్రతినిధులు బూతులు, అసభ్య పదజాలంతో ఈ బడ్జెట్ సమావేశాల్లో రెచ్చగొట్టినా సంయమనం పాటించండి. వైసీపీ వాళ్లు దిగజారుడు వ్యాఖ్యలు చేసినా పట్టించుకోవాల్సిన అవసరం లేదు. వారు ఏదో అన్నారని మీరు దిగజారి ఇష్టానుసారం భాషను వాడొద్దు. స్పందించే సందర్భంలో హుందాగా సమాధానం ఇవ్వండి. చట్టసభల్లో మాట్లాడే ప్రతి మాటను జనసేన ప్రజాప్రతినిధులు ఆచితూచి వాడాలి. మనలో ఎక్కువ మంది, నాతో సహా తొలిసారి ఎన్నికైన వారు ఉన్నారు. భాష విషయంలో ఎంత జాగ్రత్తగా ఉండాలో నాదెండ్ల మనోహర్ , కొణతాల రామకృష్ణ మండలి బుద్ధ ప్రసాద్ , హరిప్రసాద్ గైడ్ చేయాలి.

**సీనియర్లతో మాట్లాడండి.. ప్రతి చర్చలో పాల్గొనండి**

పార్టీ నుంచి ఎన్నికైన శాసనసభ్యుల్లో నాతో సహా చాలామంది కొత్తవారు. సభలో చేపట్టే ప్రతి చర్చ సహేతుకంగా జరగాలి. అసెంబ్లీలో ప్రతి నిమిషం చాలా విలువైంది. ప్రజలకు సంబంధించిన అంశాలను జీరో అవర్, ప్రశ్నోత్తరాల్లో లేవనెత్తండి. అలాగే ఇతర అంశాలకు సంబంధించి జరిగే చర్చల్లో చురుగ్గా పాల్గొనాలి. పార్టీలో సీనియర్ రాజకీయ నాయకులున్నారు. నాదెండ్ల మనోహర్ , కొణతాల రామకృష్ణ , మండలి బుద్ధ ప్రసాద్ కందుల దుర్గేష్ లాంటి అనుభవజ్ఞులు మనకు ఉన్నారు. ఏ అంశంలో అయినా సందేహాలు వస్తే వారితో చర్చించి, వారి సూచనలకు అనుగుణంగా ముందుకు వెళ్లండి. సభలో నడుచుకోవాల్సిన విధానం, మాట్లాడాల్సిన తీరు, సమస్యలను సభ ముందుకు తీసుకురావాల్సిన విధానం గురించి చర్చించండి. సీనియర్లతో మాట్లాడటం వల్ల సభా సంప్రదాయాలు, విలువైన సమాచారం తెలుస్తుంది. అలాగే ప్రజా సంబంధిత అంశాలపై జరిగే చర్చల్లో మాట్లాడటం కూడా ప్రధానం. సమస్యలపై సూటిగా మాట్లాడటం, సమస్యలకి పరిష్కారం చెప్పటం కూడా అవసరం.

**అధ్యయనం తప్పనిసరి**

ప్రతి శాసనసభ్యుడు బడ్జెట్‌ను అధ్యయనం చేయాలి. ప్రభుత్వ రాబడులు, ఖర్చులు, శాఖల వారీగా కేటాయింపులు, అప్పులు ఇతరత్ర అంశాలపై క్షుణ్ణంగా తెలుసుకోవాలి. ఒకవేళ కొత్తగా ఎన్నికైన సభ్యులకు కొన్ని విషయాల్లో సందేహాలు ఉంటే సీనియర్లను అడిగి తెలుసుకోండి. బడ్జెట్ పై జరిగే పద్దుల చర్చలో పాల్గొనండి. ప్రతి ఒక్కరూ చర్చల్లో భాగస్వాములు కావాలి. సభ్యులు తమకి ఏయే శాఖలపై అవగాహన, ఆసక్తి ఉన్నాయో వాటి ఆధారంగా చర్చల్లో మాట్లాడాలి. సభ్యుల ఆసక్తి, అవగాహన వివరాలు విప్ లు సేకరించాలి. అలాగే నియోజకవర్గంలోని ప్రజా సమస్యలను తెలుసుకొని రాష్ట్రవాప్తంగా ఆ తరహా సమస్యలు ఉంటే వాటినీ క్రోడీకరించి మాట్లాడండి. దానివల్ల ప్రతి సభ్యుడి గొంతు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రజలందరికీ అర్థం అవుతుంది" అన్నారు. ఈ సమావేశంలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా పోటీలో ఉన్న ఆలపాటిని ఓడించాలి

- వైసిపి శ్రేణులకు జగన్ దిశా నిర్దేశం
- కేఎస్ లక్ష్మణరావుకు మద్దతు ఇవ్వండి

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**



వైసీపీ అధినేత జగన్.. ఆదివారం ఉదయం బెంగళూరు నుంచి తాడేపల్లికి చేరుకున్నారు. ఆ వెంటనే ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసీపీ అనుకూల విధానాన్ని నాయకులకు వివరించారు. మనం పోటీలో లేకపోయినా కూటమి అభ్యర్థిగా పోటీలో ఉన్న ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను ఓడించాలి అని జగన్ పిలుపునిచ్చారు. తాడేపల్లిలో వైఎస్ఆర్సీపీ సీనియర్ నేతలతో వైఎస్ జగన్ సమావేశమయ్యారు. ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న కేఎస్ లక్ష్మణరావుకి సపోర్ట్ చెయ్యాలని గుంటూరు జిల్లా వైసీపీ నాయకులకు జగన్ సూచించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాలరెడ్డి, మాజీ మంత్రి విడదల రజినీ, మాజీ ఎమ్మెల్యేలు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, కోన రఘుపతి తదితరులు హాజరయ్యారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో మనం పోటీ చేయడం లేదని సైలెంట్ గా ఉండొద్దు. కూటమి అభ్యర్థులను ఓడిం చేందుకు బలమైన అభ్యర్థులకు మద్దతుగా నిలవాలి. కృష్ణా-గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీగా కేఎస్ లక్ష్మణరావు పోటీ చేస్తున్నారు. బలం లేకపోయినా ఆయన పీడీఎఫ్ తరపున పోటీ చేయడానికి మనం మద్దతు ఇవ్వడం వల్లే జరిగింది. లక్ష్మణరావు విజయానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలి. లక్ష్మణరావు గతంలో మనకు సహకరించారు. కూటమికి పోటీ ఇచ్చేది లక్ష్మణరావు అని చూడకుండా వైసీపీ అన్న భావనలో మీరు పని చేయాలి అని జగన్ దిశానిర్దేశం చేశారు. కాగా, మరో మూడు రోజుల్లో రాష్ట్రంలోని మూడు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికల పోలింగ్ ఈ నెల 27న జరగ నుంది. ఉమ్మడి గుంటూరు, కృష్ణాజిల్లాల నుంచి టీడీపీ అభ్యర్థిగా మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ పోటీ చేస్తున్నారు. ఆది నుంచి కూడా వైసీపీ పీడీఎఫ్‌కు మద్దతు ఇస్తోందన్న ప్రచారం ఉన్నప్పటికీ.. ఇప్పటి వరకు బయట పడలేదు. కానీ, తాజాగా జగన్.. సమావేశం పెట్టి మరీ పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావును గెలిపించాలని కోరడం గమనార్హం. దీంతో పోటీ రసవత్తరంగా మారనుంది.

## నిబంధనల ప్రకారం సజావుగా పోలింగ్ నిర్వహించండి

**పోలింగ్ సిబ్బందిని ఆదేశించిన డీఆర్వో మురళి**



**నరసరావుపేట, మేజర్ న్యూస్ :** గుంటూరు-కృష్ణ జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించనున్న పోలింగ్ సిబ్బంది నిబంధనల ప్రకారం సజావుగా పోలింగ్ నిర్వహించాలని ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, డిఆర్ఓ మురళి ఆదేశించారు. ఈనెల 27వ తేదీన ఉమ్మడి కృష్ణ-గుంటూరు జిల్లాల పట్టబద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ విధులకు సంబంధించి శనివారం స్థానిక కలెక్టరేట్ లోని డాక్టర్ గుర్రం జాషువా సమావేశ మందిరంలో పోలింగ్ సిబ్బందికి రెండో విడత శిక్షణా తరగతులు నిర్వహించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద పోలింగ్ సామాగ్రి స్వీకరించడం నుంచి పోలింగ్ అనంతరం తిరిగి డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద సీల్ చేసిన బ్యాలెట్ బాక్సులను సమర్పించే వరకూ ప్రతి అంశం గురించి వివరించారు. ఎమ్మెల్సీ ఎన్నికలలో ఓటు వేసే విధానం సంక్లిష్టంగా ఉంటుందని, ఓటు వేసేందుకు వచ్చిన ప్రతి ఒక్కరికీ ప్రాధాన్యతా క్రమంలో ఓటు నమోదు చేసి, బ్యాలెట్ బాక్సులో ఓటు వేసే విధానం గురించి స్పష్టంగా తెలియజేయాలన్నారు. ఈ ఎన్నికలలో చెల్లని ఓట్లను గణనీయంగా తగ్గించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నరసరావుపేట, సత్తెనపల్లి, గురజాల రెవెన్యూ డివిజన్ ల ఆర్డీవోలు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లు, పివోలు, ఏపీవోలు, ఎమ్మెల్సీ ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గ్రూప్-2 మెయిన్స్ పరీక్షకు 92 శాతం మంది హాజరు

**ఏపీపీఎస్సీ అధికారుల వెల్లడి**



**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

గ్రూప్-2 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ తెలిపింది. ఆదివారం నిర్వహించిన గ్రూప్-2 మెయిన్స్ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న 92,250 మంది అభ్యర్థుల్లో 86,459 మంది హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోగా.. వారిలో 92శాతం మంది హాజరయ్యారని అధికారులు వెల్లడించారు. గ్రూప్-2 ప్రధాన పరీక్షను వాయిదా వేయాలని కూటమి ప్రభుత్వం సూచించినా ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మాత్రం యథావిధిగా పరీక్ష నిర్వహించింది. పరీక్ష నిర్వహణ అభ్యర్థులకు శ్రేయస్కరం కాదని, హైకోర్టులో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాల్సినందున వాయిదా వేయాలని ఏపీపీఎస్సీ కార్యదర్శికి సాధారణ పరిపాలన శాఖ లేఖ రాసింది. పరీక్ష రాసే అభ్యర్థులు డిగ్రీ పూర్తిచేసిన వారని, వాయిదా వేస్తే అది శాసనమండలి ఎన్నికల కోడ్ ఉల్లంఘన కిందకు వస్తుందని ఏపీపీఎస్సీ కార్యదర్శి శనివారం సాయంత్రం ప్రభుత్వానికి లేఖరాశారు. శాసనమండలి ఎన్నికలు నిర్వహించే కేంద్ర ఎన్నికల సంఘం పరిధిలోనే ఏపీపీఎస్సీ ఉన్న విషయాన్ని అందులో గుర్తుచేశారు. వాయిదా నిర్ణయం డిగ్రీ పూర్తిచేసిన అభ్యర్థులను ప్రభావితం చేస్తుందన్న విషయాన్ని అందులో పేర్కొన్నారు. ఈ క్రమంలో పరీక్ష నిర్వహణపై శనివారం రోజంతా తీవ్ర ఉత్కంఠ నెలకొంది. చివరి వరకు వాయిదా పడుతుందన్న ఆశతో ఉన్నవారు.. దూరప్రాంతాల్లో ఉన్న పరీక్ష కేంద్రాలకు చేరుకునేందుకు ఇబ్బంది పడ్డారు.

# ఎమ్మెల్సీ అభ్యర్థి లక్ష్మణరావుకు మద్దతుగా శ్యామలానగర్ పార్క్ వాకర్స్



**గుంటూరు మేజర్ న్యూస్ :** ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ అభ్యర్థిగా ఉమ్మడి కృష్ణ – గుంటూరు జిల్లాల్లో పోటీ చేస్తున్న కె.ఎస్.లక్ష్మణరావుకు మద్దతుగా గుంటూరులోని శ్యామలా నగర్ పార్క్ వాకర్స్ నిలిచారు. ఈనెల 23వ తేదీ ఆదివారం ఉదయం ప్రచార కార్యక్రమంలో భాగంగా శ్యామల నగర్ పార్కుకు విచ్చేసిన కె.ఎస్.లక్ష్మణరావును బలపరుస్తూ ప్రచార కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ కె.ఎస్.లక్ష్మణరావు గత 14 సంవత్సరాలుగా శాసనమండలి సభ్యునిగా నిజాయితీతో, ప్రజా సమస్యలపై ఉద్యమించారని తెలిపారు. నిరంతరం ప్రజల మధ్య ఉంటూ ప్రజల సమస్యలను అర్థం చేసుకొని పరిష్కార మార్గాలను చూపిస్తూ ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చే వారన్నారు. సోషల్ మీడియాలో కె.ఎస్.లక్ష్మణరావు పై అసత్య ప్రచారాలు చేస్తూ ఉండటాన్ని తీవ్రంగా ఖండించారు. శాసనమండలి అభ్యర్థిగా పోటీ చేస్తున్న కె.ఎస్.లక్ష్మణరావు ప్రసంగిస్తూ గుంటూరు జిల్లాలో కార్మిక, కర్షక, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికై శాసనమండలిలో ప్రజావాణిని వినిపిస్తున్నానన్నారు. గుంటూరు ఛానల్ విస్తరణకు వరికెలపూడిసెల ప్రాజెక్ట్ నిర్మాణానికి కృషి చేస్తున్నానన్నారు. విభజన హామీల అమలు, రాజ్యాంగ పరిరక్షణ, నిరుద్యోగుల ఉపాధి అవకాశాల కోసం తన కృషి కొనసాగిస్తానన్నారు. చరిత్ర అధ్యాపకులు పి. పోతురాజు మాట్లాడుతూ రచయితగా, మేధావిగా, వక్తగా, విశ్లేషకుడిగా తన శక్తి యుక్తులన్నిటినీ కె.ఎస్.లక్ష్మణరావు ప్రజల కోసం వినియోగిస్తున్నారని సామాజిక న్యాయం కోసం తపించే వారన్నారు. ఈ కార్యక్రమంలో శ్యామల నగర్ పార్క్ వాకర్స్ నేతలు కనపర్తి రాఘవరావు, నారాయణ మూర్తి తదితరులు సంపూర్ణ మద్దతు ఇస్తూ శ్యామల నగర్ వాసులందరూ శ్యామల నగర్‌లో నివసిస్తూ శ్యామలా నగర్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న కె.ఎస్.లక్ష్మణరావును గెలిపించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# వైవీ సుబ్బారెడ్డిని కలిసిన బొల్లా అసమ్మతి నేతలు

## వినుకొండ పట్టణంలో త్వరలో పట్టణంలో పార్టీ కార్యాలయం ఏర్పాటు



**వినుకొండ మేజర్ న్యూస్ :** వినుకొండ నియోజకవర్గం లోని పలువురు వైసీపీ నేతలు, కార్యకర్తలు ఆదివారం పార్టీ సీనియర్ నేత వైవీ. సుబ్బారెడ్డి ని కలిసి, నియోజక వర్గానికి నూతన ఇన్చార్జి ని నియామకం చేయాలని కోరారు. అంత సావధానంగా విన్న వైవీ.సుబ్బారెడ్డి నియోజకవర్గ పరిస్థితులపై త్వరలో జగన్మోహన్ రెడ్డి తో చర్చిస్తానని తెలిపినట్లు తెలిపారు. నియోజకవర్గంలో త్వరలో పార్టీ కార్యాలయం ఏర్పాటు చేసి... శావల్యాపురం మండలం సీనియర్ నేత, ఈపూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చుండూరి వెంకటేశ్వర్లు అధ్వర్యంలో పార్టీ కోసం పని చేస్తామని తెలిపినట్లు, మీడియా కు తెలియజేసారు.




సెంట్రల్ ఎక్సైజ్ దినోత్సవ శుభాకాంక్షలు

ఫిబ్రవరి - 24

సాధు నరసింహారెడ్డి, I.R.S.
కమిషనర్ ఆఫ్ సెంట్రల్ టాక్స్

కమిషనర్ అండ్ స్టాఫ్, సెంట్రల్ జి.ఎస్.టి. కమిషనరేట్, గుంటూరు.

1944 సం॥లో భారత ప్రభుత్వం సెంట్రల్ ఎక్సైజ్ మరియు ఉప్పు చట్టాన్ని ఆమోదించినప్పుడు సెంట్రల్ ఎక్సైజ్ దినోత్సవ చరిత్ర ప్రారంభమైంది. 1966లో ఈ చట్టం పేరు మార్పు చెంది '1944 సెంట్రల్ ఎక్సైజ్ యాక్ట్'గా మారింది.

విలేకరులు కావలెను

నేటి దినపత్రిక సూర్య

అక్షరానికి నైతికతను అద్ది దేశవ్యాప్తంగా 23 ఎడిషన్లతో సామాజిక న్యాయం వైపు మళ్ళించే యజ్ఞం "నేటి దినపత్రిక సూర్య" చేపట్టింది, అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ యజ్ఞంలో "నేటి దినపత్రిక సూర్య" అక్షర సైనికులను మరి కొంత మందిని నియమించుకోవాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా పల్నాడు, గుంటూరు జిల్లాలలో ఖాళీగా ఉన్న మండలాలకు విలేకరులకు నియమించుకోవదలిచాము. కావలెను. ఆసక్తిగల వారు ఈ క్రింది మండలాలకు ఈ నెల 31వ తేదీలోగా ఇంటర్వ్యూకి ఈ క్రింది అడ్రస్సులో సంప్రదించగలరు.

1.తాడికొండ, 2. తుళ్ళూరు, 3. మేడికొండూరు, 4. ఫిరంగిపురం, 5. ప్రత్తిపాడు, 6. పెదనందిపాడు, 7. కాకుమాను, 8.వట్టిచెరుకూరు, 9.అమరావతి, 10.గుంటూరు రూరల్, 11.గుంటూరు జిల్లాపరిషత్, 12. దాచేపల్లి, 13. బొల్లాపలి, 14. పెదకూరపాడు, 15. పొన్నూరు

పి. బాలు (చిన కొండయ్య)
బ్యూరో ఇన్‌చార్జి, ఉమ్మడి గుంటూరు జిల్లా. సెల్ : 9705554777

జిల్లా ఇన్‌చార్జిలు : జి.శ్రీనివాసరావు సెల్ : 9959426987 ఆర్.డి.నాయక్ సెల్ : 8897455466

ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రాంతీయ కార్యాలయం, 9/1, అరండల్‌పేట, గుంటూరు.

నేటి దినపత్రిక సూర్య కుటుంబ సభ్యులు

నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com

"నేటి దినపత్రి సూర్య" ను ఆదరిస్తున్న గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని విశేష పాఠకులు, అధికారులు, రాజకీయ నాయకులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తున్నాం... ఏదైనా వార్తలు, ప్రకటనలు, యాడ్స్, క్లాసిఫైడ్స్, లీగల్ నోటీసులు ఇలాంటి ప్రకటనలను మా ఈ క్రింది పాత్రికేయులకు తెలియజేయగలరు. సరసమైన ధరలకు యాడ్స్ పబ్లిష్ చేయబడును. మా పత్రికలో పనిచేస్తున్న పాత్రికేయ బృందం.

| | | | |
|---|---|---|---|
| పి. బాలు (చిన కొండయ్య) బ్యూరో ఇన్‌చార్జి, ఉమ్మడి గుంటూరు జిల్లా. సెల్ : 9705554777 | జి.శ్రీనివాసరావు గుంటూరు జిల్లా ఇన్‌చార్జి సెల్ : 9959426987 | వి.వెంకటరెడ్డి బొల్లాపల్లి రిపోర్టర్ సెల్ : 80191 99991 | |
| ఆర్.ధావుర్య నాయక్ (సూర్య ఆర్.డి.) స్టాఫ్ రిపోర్టర్, గుంటూరు జిల్లా. సెల్ : 8897455466 | జి.హిరన్మాయి (కన్నల్) నరసరావుపేట ఆర్‌సి ఇన్‌చార్జి జిల్లా క్రైమ్ రిపోర్టర్ | చెట్టిపోగు కాశి దాచేపల్లి రిపోర్టర్ సెల్ : 9963343327 | |
| శేషగిరి రాజు మాచర్ల ఆర్సీ ఇన్‌చార్జి సెల్ : 8341408201 | వై.ఏసుబాబు గురజాల ఆర్సీ ఇన్‌చార్జి సెల్ : 9701250872 | బి.పూర్ణచంద్రరావు సత్తెనపల్లి ఆర్‌సి ఇన్‌చార్జి సెల్ : 9866246951 | చెవుల రంగారావు మెడికల్ రిపోర్టర్, గుంటూరు సెల్ : 9490544635 |
| యం.కృష్ణ మంగళగిరి ఆర్‌సి ఇన్‌చార్జి సెల్ : 9393309149 | వి.రవికుమార్ తెనాలి ఆర్‌సి ఇన్‌చార్జి సెల్ : 99083 38200 | డి. చైతన్య వినుకొండ ఆర్‌సి ఇన్‌చార్జి సెల్ : 9381968453 | వి.లూథర్ నరసరావుపేట రిపోర్టర్ సెల్ : 7799382078 |
| జి.ఏలియా ముప్పాళ్ళ రిపోర్టర్ సెల్ : 9392231959 | బి.సాంబశివరావు రాజుపాలెం రిపోర్టర్ సెల్ : 9949382676 | రమేష్ దుగ్గిరాల రిపోర్టర్ సెల్ : 9866782780 | ఎస్.వెంకటేశ్వర్లు పెదకాకాని రిపోర్టర్ సెల్ : 9948175840 |
| కె.నాగరాజు రిపోర్టర్, గుంటూరు సెల్ : 7799881000 | డి.రమేష్ ఈపూరు రిపోర్టర్ సెల్ : 9110734898 | పి.లక్ష్మీనారాయణ నూజెండ్ల రిపోర్టర్ సెల్ : 9666474953 | ఎస్.కె. రవూఫ్ శావల్యాపురం రిపోర్టర్ సెల్ : 7989434737 |
| అక్కిరెడ్డి నరసరావుపేట మెడికల్ రిపోర్టర్ సెల్ : 9849134987 | బి.గురవయ్య వినుకొండ క్రైం రిపోర్టర్ సెల్ : 9908340426 | వి.లక్ష్మీనారాయణ రెంటచింతల రిపోర్టర్ సెల్ : 8500079075 | పి.వెంకటేశ్వర్లు దుర్గి రిపోర్టర్ సెల్ : 8185815858 |
| టి.శ్రీకాంత్ వెల్దుర్తి రిపోర్టర్ సెల్ : 9912818723 | పి.మణికంఠ మాచర్లటౌన్ రిపోర్టర్ సెల్ : 7013169885 | ఎస్.డి.మహబూబ్ మాచర్ల క్రైం రిపోర్టర్ సెల్ : 9989124898 | ఎం.కోటేశ్వరరావు మాచవరం రిపోర్టర్ సెల్ : 6303775169 |
| డి.మల్లికార్జునరావు యడ్లపాడు రిపోర్టర్ సెల్ : 8309237441 | రమేష్ క్రోసూరు రిపోర్టర్ సెల్ : 9493148828 | ఎస్.విజయభాస్కర్ గుంటూరు రిపోర్టర్ సెల్ : 9440822538 | షేక్ నాగూర్ నకరికల్లు రిపోర్టర్ సెల్ : 98489 26300 |
| పి.ఆనంద్ వినుకొండ రూరల్ రిపోర్టర్ సెల్ : 8125125239 | నాగరాజు మంగళగిరి టౌన్ రిపోర్టర్ సెల్ : 9032258913 | రమేష్ నరసరావుపేట రూరల్ రిపోర్టర్ సెల్ : 7075942600 | "నేటి దినపత్రిక సూర్య" ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యాలయం. 9/1, అరండల్‌పేట, గుంటూరు. |